క్లుప్తంగా

ఈఓఆర్‌డీకి సన్మానం



మహేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల ఈఓఆర్‌డీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లిన మహేష్‌ను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మహేష్ సేవలను కొనియాడారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

మడకశిరరూరల్: మడకశిర నగర పంచాయతీలోని చీపులేటి గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. చెడిపోయిన వాటర్ స్కీమ్ మోటారును మరమ్మతు చేసి నీటి సమస్య తీర్చాలన్నారు. వెంటనే చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ ప్రియాంక అక్కడికి చేరుకొని మోటారును మరమ్మతు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మోటారు చెడిపోవడంతో వారం రోజుల నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నామన్నారు.

వేలం ద్వారా రూ.1.18 లక్షల ఆదాయం

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ సుధాకర, సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల పార్కింగ్, వారపు సంత వేలం పాటను నిర్వహించారు. వాహనాల పార్కింగ్‌ను సిద్ధేశ్వర రూ.73 వేలకు, వారపు సంతను రవికుమార్ రూ.45 వేలకు దక్కించుకున్నారని తెలిపారు.

నివేదికలు సమగ్రంగా ఉండాలి

రొద్దం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈఓఆర్డీ కేశవరెడ్డి సమావేశం నిర్వహించారు. శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, మహిళా పోలీస్, ఐకేపీ, పంచాయతీ కార్యదర్శులు సంబంధించిన శాఖల వివరాలను సర్వే చేసి నివేదికలు తయారు చేయాలన్నారు. నివేదికలు సమగ్రం ఉండాలని ఈఓఆర్డీ చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: స్థానిక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఈఎస్‌ఐ ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఉండాల్సినంత మంది డాక్టర్లు లేరన్నారు. మందుల సరఫరా తగ్గడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఈఎస్‌ఐ డాక్టర్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామంలో సర్వే నంబరు 323లో దళితులకు చెందిన 3 ఎకరాల భూమి ఆక్రమించారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మురళీ కృష్ణకు కేవీపీఎస్ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులు అక్రమంగా రికార్డులు సృష్టించి భూమి కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, నాయకులు వెంకటేశులు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

గుడిబండ: మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ నాగరాజునాయక్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో మండలంలోని గ్రామ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఉన్నత చదువుకు ఆర్థిక సాయం

పావగడ: దివ్యాంగుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించడానికి బెంగళూరుకు చెందిన సమర్థనం ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా సుమారు 50 మంది దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు మూడేళ్ల పాటు ఖర్చులను సంస్థ భరిస్తుందని సమర్థనం ట్రస్ట్ ప్రతినిధి రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని స్వామి వివేకానంద ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సకలాంగుల మాదిరే దివ్యాంగులు సైతం ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు పొందాలన్న ఆకాంక్షతో తమ సంస్థ చేయూత అందిస్తోందని తెలిపారు. స్వామి వివేకానంద ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీంద్ర, మైలప్ప పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి జేడీఎస్ శ్రీకారం

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రానికి మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాలూకాలోని వడ్రేవులోని ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి స్థానిక జేడీఎస్ పార్టీ అభ్యర్థి తిమ్మరాయప్ప ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ తిమ్మారెడ్డి, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ఈ-నామ్

- కొనసాగుతున్న బహిరంగ వేలాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



అమ్మకాల కోసం రైతులు తెచ్చిన చింతపండు

హిందూపురం: హిందూపురం మార్కెట్‌యార్డులో పంట ఉత్పత్తుల లావాదేవీలు పారదర్శకతతో సాగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ-నామ్ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు క్రయవిక్రయాలు చట్టపరిధిలో ఉంటాయని ఆలోచనతో అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అధికారులు మాత్రం ఈ- నామ్ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారు. కొంత మేరకు ఆన్‌లైన్ అమ్మేసి మిగిలినది పాతపద్ధతిలోనే బహిరంగ వేలాలనే కొనసాగిస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో 'పురం' మార్కెట్‌కు పేరు

చింతపండు, మిర్చి వ్యాపారాలకు హిందూపురం మార్కెట్‌కు రాష్ట్రస్థాయిలో పేరుంది. హిందూపురంతో మడకశిర, అగళి, పరిగి, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున రైతులు రోజుకు సుమారు 10 వేల నుంచి 15 వేల క్వింటాళ్ల వరకు చింత పండు తీసుకొస్తుంటారు. ఉదయం వచ్చిన ఉత్పత్తులన్నీ అధికారులు ఈ - నామ్ అమలు చేస్తున్నప్పటికీ తర్వాత వచ్చిన ఉత్పత్తులను వ్యాపారులు నేరుగా బహిరంగంగా వేలం వేసి కొనుగోళ్లు సాగిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

తూకాల్లో మోసం.. అధిక కమిషన్ వసూలు

ఆరుగాలం కష్టపడి చింత ఫలసాయాన్ని యార్డుకు తీసుకువస్తే తూకాల్లో మోసం చేయడమే కాదు ఎక్కువ కమీషన్లు తీసుకుంటూ కొందరు వ్యాపారులు రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతుల నుంచి 30 కేజీల సంచి తుకం వేస్తే లెక్కలోకి వచ్చేది మాత్రం 29 కేజీలే చూపుతున్నారని రైతులు వాపోతున్నారు. సంచి, వేస్టేజ్ కలిసి కేజీ తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకాలు వేసే సమయంలో హమాలీలు కూడా కొసరు అంటూ కొంత లాగేసుకుంటున్నారని చెబుతున్నారు. అలాగే కమిషన్ కూడా రూ.8 వసూలు చేస్తుండటంతో నష్టపోతున్నామంటున్నారు.

ధరలు పెంచాలి



ఈసారి ధరలు అంత ఆశాజనకంగా లేవు. ఇంకా బాగా పెరగాల్సి ఉంది. ప్రస్తుతం బెస్ట్ కరీపులీ రూ.1800 నుంచి రూ.22 వేల లోపే ఉంది. ఆన్‌లైన్ టెండర్‌లోనూ ధరలు పెరగడంలేదు. వేలాలలోనే వెంటనే చేతి డబ్బు వస్తుందని అమ్మకం చేస్తున్నాం. రూ.26 వేలు నుంచి రూ.30 వరకు పైబడి పలికితేనే రైతులు లాభాలు చూడగలరు.

–సంజీవప్ప, కొత్తపల్లి

అధికారులకే ధర నిర్ణయించాలి



ఇ-నామ్ వేయడం వల్ల రైతుకు ఏం లాభం కలగడంలేదు. వ్యాపారులు తక్కువ ధరలకు వేస్తే ఏం చేయగలం. అధికారులు ధరలు నిర్ణయించి ఆ ప్రకారం టెండర్ వేయాలని చెబితే రైతులకు లాభం. పెద్దమొత్తంలో సరుకు తెచ్చిన రైతులు ఆన్‌లైన్‌లో అమ్ముకుంటారు. కొంత తెచ్చిన రైతులు తప్పని సరిగా వేలం ద్వారానే వెంటనే చేతికి డబ్బు అందాలని అమ్ముకుంటున్నారు.

– జయరామప్ప, బీహెచ్ హళ్లి

ఈ-నామ్ ద్వారానే కొనుగోళ్లు



ఈ-నామ్ ద్వారానే వ్యాపారాలు కొనసాగిస్తున్నాం. మా దృష్టికి రాకుండా ఎక్కడైనా కొంత మొత్తంలో బహిరంగ వేలాలు నిర్వహిస్తుంటారు. అవి కూడా వేలాల ద్వారా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. అలాగే తూకాలు మోసాలు, కమీషన్లపై రైతులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశులు, యార్డు ఇన్‌చార్జి. కార్యదర్శి

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పురోగతిని అధికారులు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆయా శాఖల అధికారులు గుర్తించి సత్వర పరిష్కారం కోసం కృషిచేయాలని ఎంపీపీ ప్రమీల అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మండల సర్వసభ్య సమావేశం వేదికలాంటిందన్నారు. అయితే కొన్ని శాఖల అధికారులు సర్వ సభ్యసమావేశానికి గైర్హాజరు కావడంతో తరచు సమస్యలు విన్నవించడానికి సభ్యులకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. సర్వ సభ్య సమావేశానికి హజరు కాని శాఖల అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన ఎంపీడీఓ రఘునాథగుప్తా సర్వసభ్య సమావేశానికి హాజరు కాని రోడ్లు భవనాలశాఖ అధికారులతో పాటు ఉద్యాన శాఖ, సోషియల్ వెల్ఫేర్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో వ్యాధులకు చెక్



గోరంట్ల: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గోరంట్ల: సైక్లింగ్‌తో ఎన్నో వ్యాధులు దూరమవుతాయని, ముఖ్యంగా గుండెజబ్బులు, అధిక రక్తపోటు, క్యాన్సర్ తదితర రోగాలను చెక్ పెట్టొచ్చని గోరంట్ల ప్రభుత్వాస్పత్రి డాక్టర్ సుప్రీత పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ 20 నిమిషాల పాటు సైక్లింగ్ చేయాలన్నారు. మంగళవారం డాక్టర్ సుప్రీత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ వెంకటేశ్వరరావు, పీఎచ్ఎన్ భాగ్యలక్ష్మి, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి: సైకిల్ అనేది కేవలం ప్రయాణ సాధనంగా మాత్రమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడటానికి సైతం ఉపయోగించుకోవచ్చని పరిగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వైద్యారోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో హెల్త్‌మేళా-సైకిల్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ లక్ష్మీదేవి కార్యక్రమాన్ని ప్రారంభించగా... ప్రధానోపాధ్యాయుడు స్వతకృపరాజు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి మాట్లాడుతూ సైకిల్ తొక్కడమనేది నిత్యవ్యాయామంలో తప్పక అనుసరించాల్సిన విధానమన్నారు. ప్రధానంగా క్యాన్సర్ వ్యాధి నియంత్రించడానికి ఇది ఒక దివ్య ఔషధంగా పనిచేస్తుందన్నారు. రక్తపోటును నియంత్రించడంతో పాటూ మనిషికి ఒత్తిడిని దూరం చేయడంలో తోడ్పడుతుందన్నారు. అనంతరం రోగులకు మందులు, మాత్రలను అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధిని కనుగొని చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయడానికి కృషి చేద్దామని సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ షమీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది 'సైకిల్ ఫర్ హెల్త్, ఫిట్ ఇండియా మూమెంట్ ఫర్ బెటర్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధి ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సోకినప్పుడు మనిషిలోని మానసిక సామర్థ్యం పెంచడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ నుంచి గ్రామ పురవీధుల గుండా బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఖాదర్‌వలీ, సూపర్ వైజర్ శ్రీలక్ష్మీ, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు సహోపాధ్యాయుల సస్పెన్షన్

పావగడ: మధుగిరి శైక్షణిక జిల్లా పరిధిలోని పావగడ, కొరటగెరె తాలూకాలకు చెందిన ముగ్గురు గ్రేడ్-2 సహోపాధ్యాయులు సస్పెండయ్యారు. వివరాల్లోకి వెళితే.. 2012-13, 2014-15 ఏడాదులకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రేడ్-2 సహోపాధ్యాయుల నియామకంలో భాగంగా దరఖాస్తులు అందించకుండానే అక్రమంగా ఉద్యోగాలు పొందిన పావగడ తాలూకాలోని నాగలమడక గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సహోపాధ్యాయుడు జీకే మోహన్ కుమార్ (ఆర్ట్స్ విభాగం), వళ్లూరు గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సహోపాధ్యాయుడు మంజునాథ్ (కన్నడ భాష)తో పాటు కొరటగెరె తాలూకా బుక్కాపట్టణం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సహోపాధ్యాయిని జీఎన్ దీపారాణి (ఆర్ట్స్ విభాగం) సస్పెండ్‌కు గురైన వారిలో ఉన్నారు. సీఐడీ అధికారులు అందించిన నివేదిక, విద్యాశాఖ నిర్వహించిన విచారణలో భాగంగా ఈ ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిని సస్పెండ్ చేసినట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి కోరారు. బుధవారం వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, ఎంజీఎం ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్లు, పాలిటెక్నిక్ కళాశాల, బసవనపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, సచివాలయాల్లో అధికారులను, ఉపాధ్యాయులను, అధ్యాపకులను, కార్యదర్శులను కలిశారు. వారికి కరపత్రాలను అందజేసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, నిజాముద్దీన్ పాల్గొన్నారు.


ఈ- క్రాప్ చేయించుకోవాలి



ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు

రొద్దం: మండలంలో నిర్వహిస్తున్న ఈ - క్రాప్ నమోదును వ్యవసాయ కమిషనరేట్ నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు పరిశీలించారు. బుధవారం మండలంలోని పెద్ద మంతూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఈ - క్రాప్ నమోదును పరిశీలించారు. ప్రతి రైతూ పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ- క్రాప్ చేస్తేనే ప్రభుత్వం నుంచి వ్యవసాయనికి సంబంధించిన పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ, ఏఓ నివేదిత, ఏఈఓ అంజాద్, వీఏఏ యోగేష్, వీఆర్‌ఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వసంత

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వసంత అనే విద్యార్థిని జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జనవరిలో పశ్చిమ గోదావరి జిల్లా వేదవేగిలో జరిగాయన్నారు. ఆ పోటీల్లో వసంత విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుధామణితో పాటు పాఠశాల కమిటీ చైర్మన్ చెన్నకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్లూరును సందర్శించిన స్పెయిన్ దేశస్తులు

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామాన్ని స్పెయిన్ దేశస్తులు మంగళవారం సందర్శించారు. ఆర్డీటీ సహకారంతో గ్రామంలో 23 ఇళ్లను నిర్మించడానికి స్పెయిన్ దేశస్తులు సహాయం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఇళ్లు, కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు.

'పురం'లో ఆంజనేయుడి భారీ విగ్రహ నిర్మాణం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం: జిల్లాకే తలమానికంగా నిలిచేలా హిందూపురంలో 27 అడుగుల ఏకశిల రాతి ఆంజనేయుడి విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మేళాపురం ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు, హిందూ సురక్షా సమితి, వీహెచ్‌పీ, భజరంగదళ్, వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దండురోడ్డులోని బైలాంజనేయస్వామి ఆలయం పక్కన భారీ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లా కుప్పంలో తయారైన హనుమాన్ రాతి విగ్రహాన్ని హిందూపురానికి తీసుకురానున్నట్లు చెప్పారు. 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటలకు సుగూరు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి దండురోడ్డు వరకు పెద్ద ఎత్తున శోభయాత్ర చేపట్టనున్నామన్నారు. ఈశోభ యాత్రకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, అధ్యక్షుడు నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు ఎరువులను అందిస్తున్న ఏఓ

పరిగి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయభారతి సూచించారు. మండలంలోని పీ నరసాపురంలో మంగళవారం ఆర్బీకే కేంద్రంలో జరుగుతున్న ఎరువుల పంపిణీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నిల్వ ఉంచిన ఎరువుల శాతాన్ని స్థానిక సచివాలయ ఉద్యోగులతో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నరసాపురం ఆర్బీకే పరిధిలో మొత్తం 270 బస్తాల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇప్పటి దాకా ఈ-కేవైసీ చేయించుకోని రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



కలశాలతో మహిళలు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో మారెమ్మ

పరిగి: మండలంలోని పైడేటిలో వెలసిన మారికాంబ ఆలయంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తుడు, విగ్రహ దాత మిలటరీ క్రిష్టప్ప సరోజమ్మ దంపతులచే అందించిన మారెమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కలశాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

వేధించిన వారిపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: మహిళా ఉద్యోగిని వేధించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో యాక్ట్ ప్లాస్ట్ పెయింట్స్ ముందు ధర్నా చేశారు. కియా అనుబంధంగా ఉన్న కంపెనీ పనిచేస్తున్న ఉషా అనే మహిళా ఉద్యోగిని హెచ్‌ఆర్ కరుణాకర్, విజయకుమార్ లైంగికంగా వేధించారని ఆరోపించారు. వారి మాట వినకపోవడంతో చిన్న కారణం చూపుతూ ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కరుణాకర్, విజయకుమార్‌పై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, లక్ష్మిదేవి, వజ్రం నాగప్ప, మూర్తి, శ్రీరాములు, ముత్యాలు, అంజి, అన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీకి రూ.40 వేల ఫైన్

అమరాపురం: హిందూపురం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మంగళవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా అమరాపురం వైఎస్సార్ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఓ లారీని తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేకపోవడంతో రూ.40 వేలు అపరాధ రుసుం విధించారు. అప్పటికప్పుడే యాజమాని ఆన్‌లైన్‌లో నగదు జమ చేశారు. రికార్డులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని శివశంకర్ హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: మండలంలోని హనుమపల్లిలో చెన్నకేశవులు అనే వ్యక్తి క్రిమిసంహారక గుళికలు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న చెన్నకేశవులు జీవితంపై విరక్తి చెంది క్రిమి సంహారక గుళికలు మింగాడని స్థానికులు తెలిపారు. వెంటనే వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సంపత్‌కుమార్, ధనుంజయలను మంగళవారం హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

లారీ - కారు ఢీ

పెనుకొండ రూరల్: పెనుకొండ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై దుద్దెబండ మలుపు వద్ద మంగళవారం రెండు వాహనాలను లారీ ఢీ కొనడంతో వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకొంది. స్థానికుల వివరాలమేరకు.. బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్తున్న కారు దుద్దెబండ మలుపులోని స్పీడ్ బ్రేకర్ల వద్ద స్లో అయింది. అయితే వెనుక నుంచి వచ్చిన ఓ లారీ... కారుతో పాటు పక్కనున్న మరో లారీని కూడా వెనుక నుంచి ఢీ కొంది. కారు డ్రైవింగ్ చేస్తున్న శ్రీహరి కారును వెంటనే రోడ్డు కిందకు కారు దించడంతో ప్రమాదం తప్పింది. ఢీ కొన్న లారీ పాక్షికంగా దెబ్బతినడంతో పాటు డ్రైవర్ బారస్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



గృహ సారథులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు గ్రామస్థాయిలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మండల జగనన్న సచివాలయ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలో గృహసారథులకు సామగ్రిని అందించారు. కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభం



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక క్రీడోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి పాల్గొని క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఏజీఎం సుబ్బారెడ్డి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాష్ రెడ్డి, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, మానెంపల్లి మల్లికార్జున, డీన్ నాగరాజు, పీఈటీ మారుతీ, మూర్తి, గాయిత్రి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.